కథ

# కలంపేరు

పొన్నాడ సత్యప్రకాశరావు




ఠంగ్ మంటూ గోడగడియారం ఒకటి కొట్టింది. మధ్యాహ్నం ఒంటిగంట. లంచ్ టైం. టెండర్ ఫైళ్లోంచి తలెత్తి చుట్టూ చూశాను. లంచ్ అవర్ ఎప్పుడవుతుందా అని చూస్తున్న కొందరు కొలీగ్స్ బయటకు పోతున్నారు. అంటే అప్పటివరకు పనిచేశారని కాదు. 'ఫైల్స్ క్లియరెన్స్ వీక్" గురించి టీలు త్రాగుతూ చర్చించుకొని వేడెక్కి ఉన్నారు. ఇంక అఫీషియల్‌గా తిరగొచ్చు. అంతే.

నేనూ లేచి సెకండ్ ఫ్లోర్‌లోకి వెళ్లాను. అక్కడ నా బెస్ట్‌ఫ్రెండ్ పని చేస్తున్నాడు. నేను వెళ్లేసరికి వాడు హడావుడిగా బాస్ రూంలోకి వెడుతున్నాడు. ఓ అయిదు నిమిషాలలో ఓ ఫైల్‌తో తిరిగొచ్చి టేబుల్ మీద పడేసి "పద" అన్నాడు. కేంటిన్ వైపు నడిచాం.

మావాడో రచయిత. అయితే ఇంకా 'ముద్రించ'బడలేదు. ఓ మంచి రచయిత నవ్వాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. వాడి రచనలన్నీ తగినన్ని స్టాంప్‌లతో కవరు జోడిస్తే తిరిగొస్తున్నాయి. లేకపోతే ఏమైపుతున్నాయో తెలీదు. వాడి ఏకైక పాఠకుడిని నేను. వాడి రచనలు అద్భుతంగా ఉంటాయని నేను మొహమాటానికి కూడా అనను కాని తీసి పారేసేటంతగా ఉండవు. బహుశ ఒక 'బ్రేక్‌త్రూ' వస్తే ఇంకా బాగా వ్రాయగల సామర్థ్యం ఉందని చెప్పగలను. కానీ ఆ 'బ్రేక్‌త్రూ' రావటంలేదు. ప్రచురించబడుతున్న కథలతో పోలిస్తే అతనిది 'బేడ్‌లక్' అని మాత్రం చెప్పగలను.

"ఏమిటీ హడావడి పడుతున్నావు" అడిగాను కేంటిన్‌లో టిఫిన్‌కు ఆర్డరిస్తూ.

"బాస్‌కి పంపిన ఫైల్లో నా కథ తాలుకూ పేపర్లు పెట్టి మర్చిపోయాను. అందుకే వాడు చూడకుండా తెచ్చేశాను" అన్నాడు.

"మొన్న దీపావళి కథల పోటీకి పంపించావు కదా, ఏమైంది?"

"ఫలితం షరా మామూలే. క్షేమంగా తిరిగొచ్చింది. అయితే నేనో కొత్త సామెతను సృష్టించాను"

"ఏమిటో?"

"పోటీకి పంపిన కథ సాధారణ ప్రచురణకు కూడా నోచుకోనట్లు"

ఇద్దరం నవ్వుకున్నాం.

మళ్లీ తనే అన్నాడు "నేనో నిర్ణయం తీసుకొన్నా. ఈసారి నుంచి నాపేరుతో కాక కలంపేరుతో వ్రాద్దామనుకొంటున్నా"

"మంచిదే అలా అయినా కలిసొస్తుందేమో. కలం పేరు ఏమిటి?" అడిగాను.

"క్రాంతి."

ఓ.కే. చేశాను.

0 0 0

రోజులు, నెలలు గడుస్తున్నాయి. వాడీ మధ్య వేరే బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ కావడంతో రోజూ కలుసుకోవడం పడటం లేదు. అందువలన ఒక్కోసారి వాడి రచనలు 'కనీసం' నేను కూడా చదవటం లేదు.

0 0 0

ఓ రోజు వారపత్రిక తిరగేస్తుంటే ఆ పత్రిక నిర్వహించిన కథలపోటీ ఫలితాల ప్రకటన కనబడింది. ఆతృతగా విజేతల వివరాలు పరికించా. ఆనందం పట్టలేకపోయాను. మొదటి బహుమతి క్రాంతికి. 'అదృష్టం' కథ పేరు. నేను వెంటనే వాడి ఆఫీస్‌కి వెళ్లాను. ఆ ప్రకటన చూపించాను. వాడి కళ్లలోని ఆనందాన్ని వర్ణించలేను.

"నీ నిరీక్షణ ఫలించింది. యు గాట్ ఇట్ విత్ ఎ బ్యాంగ్" అన్నాను. బయట హోటల్‌కి తీసుకెళ్లి స్వీట్ ఆర్డర్ చేశాడు.

స్వీట్ నాకిచ్చి ఒకటి నోట్లో పెట్టుకొన్న వాడి మొహం వివర్ణమైంది.

"ఏరా స్వీట్ కారంగా ఉందా?"

నా చేతిలోని పత్రిక తీసుకొని ఫలితాల వంక మరోసారి చూసి ఒక్కపెట్టున నవ్వడం మొదలుపెట్టాడు. నాకు భయం, అనుమానం కలిగాయి. లాటరీలో ప్రైజ్ వచ్చిందన్న వార్త వినగానే కొంతమంది షాక్ తిన్నారట. వీడికేం కాలేదు కదా?

వాడు నవ్వి నవ్వి కంట్రోల్ చేసుకొని,

"రచయితనవ్వాలని నేనెంత తపన పడుతున్నానో నీకు తెలుసు కదా! నా పేరు అచ్చి రాలేదని 'క్రాంతి' పేరుతో పంపుతున్నాను. అది కూడా నీకు తెలుసు. అయినా లాభం లేకపోయేసరికి నా నుదుటిరాతకు సరిపోతోందని 'శని'గా నా కలంపేరును మార్చుకొన్నాను. అయితే ఈ మధ్య మనం తరచూ కలవనందువలన నా కలం పేరు మార్పుని నీకు చెప్పే అవకాశం రాలేదు. ఈ కథలపోటీకి నేను 'శని' పేరు మీద కథ పంపాను. కథ పేరు 'లక్'. బహుమతి పొందిన 'అదృష్టం' కథా రచయిత క్రాంతిని నేను కాదు. ఒక్కోసారి కథలకు మనం పెట్టిన పేర్లు ఎడిటర్లు మారుస్తూ ఉంటారు. అలా నా 'లక్'ని 'అదృష్టం'గా మార్చారేమో అనుకొన్నా. కానీ ఈ 'శని'కి 'అదృష్టం' పట్టాలంటే 'లక్' ఉండాలిగా. కాబట్టి ఎప్పటికప్పుడు నా కలంపేరును కనుక్కొని ఫలితాలు చూస్తుండు' అని మళ్లీ నవ్వాడు.

ఆ నవ్వుతున్న కళ్లల్లో సుళ్లు తిరుగుతున్న నీళ్లు నా కళ్ల పడకపోలేదు.

■